క్లుప్తంగా

ఆరోగ్య కేంద్రంలో శిక్షణ



మాట్లాడుతున్న వైద్యాధికారులు

పొదలకూరు: మండలంలోని మహ్మదాపురం ఆరోగ్య కేంద్రంలో కేన్సర్ పరీక్షలపై 3వ విడత శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వి.నరసింహారావు, డాక్టర్ స్రవంతి వైద్య ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ కేన్సర్ పరీక్షలను నిర్వహించాల్సిందిగా సూచించారు. ఈనెల 14వ తేదీన నుంచి గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఆశా కార్యకర్తల సహాయంతో సర్వే నిర్వహించాలని పేర్కొన్నారు. అనుమానితులు ఉంటే వెంటనే వెల్నెస్ సెంటర్‌కు పంపాల్సిందిగా తెలిపారు.

సురేష్‌రెడ్డికి సన్మానం



పొదలకూరు: భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి నెల్లూరు ఆర్టీసీ జోన్ చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా సోమవారం బీజేపీ మండల నాయకులు సత్కరించారు. నెల్లూరులో ఆయన్ను కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నేతలు బాలిరెడ్డి మారుతికుమార్‌రెడ్డి, సీహెచ్ చినసుబ్రహ్మణ్యం, ప్రశాంత్, నరేంద్ర, జనార్దనరెడ్డి, ధనుంజయరావు పాల్గొన్నారు.

వీఎస్‌యూలో జాబ్‌మేళా



ఇంటర్వ్యూ చేస్తున్న ప్రతినిధులు

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్ద నున్న విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో సోమవారం జాబ్‌మేళా జరిగింది. 100 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వివిధ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేసి 48 మందికి ఉద్యోగావకాశాలు కల్పించారు. ఉద్యోగాలు పొందిన వారిని ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు అభినందించారు.

పాఠశాలల్లో ప్రత్యేక ఆధార్ శిబిరం



కేంద్రాన్ని పరిశీలిస్తున్న వసంతకుమారి

కొడవలూరు: విద్యార్థుల కోసం పాఠశాలల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని ఎంఈఓ వసంతకుమారి పేర్కొన్నారు. మండలంలోని పద్మనాభసత్రం ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని సోమవారం పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. పిల్లలకు ఆధార్‌తో పాటు పుట్టిన తేదీ తదితర వివరాలు కచ్చితంగా ఉండాలనే లక్ష్యంతో కాంప్లెక్స్ పాఠశాలల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. ఒక్కో కాంప్లెక్స్ పాఠశాలలో రెండు రోజుల పాటు శిబిరం ఉంటుందన్నారు. గండవరం, నార్తురాజుపాళెం, కొడవలూరు, యల్లాయపాళెం, కొత్త వంగల్లు కాంప్లెక్స్‌లలో ఇవి ఉంటాయని వివరించారు. హెచ్‌ఎం మణికంద్రాచారి, సీఆర్పీలు శ్రీహరి, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి



మాట్లాడుతున్న ఖాదర్‌వలీ

ఇందుకూరుపేట: వైద్య, ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ అంకితభావంతో విధులు నిర్వర్తించాలని ఏడీఎంహెచ్‌ఓ ఖాదరవలీ పేర్కొన్నారు. మండల పరిధిలోని పలు ఆరోగ్య కేంద్రాలను సోమవారం తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ.. ముఖహాజరును సకాలంలో వేయాలని కోరారు. అనంతరం ఇందుకూరుపేట ప్రభుత్వ స్కూల్లో పిల్లలకు ఐరన్ ఫోలిక్ మాత్రలను మింగిస్తున్నారానే అంశాన్ని ఆరాతీశారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో గైనిక్ విభాగాన్ని సందర్శించారు. అనంతరం ఫ్యామిలీ డాక్టర్‌లో భాగంగా కొత్తూరులో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాన్ని పరిశీలించారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ సునీల్, చిన్నపిల్లల వైద్య నిపుణులు జయపాల్‌రెడ్డి, కిశోర్ కుమార్, బ్రహ్మేశ్వర్‌నాయుడు, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, సీహెచ్‌ఓ నీలిమ, సాయి శర్వాణి, హెల్త్ అసిస్టెంట్ వరప్రసాద్, ఫార్మసీ ఆఫీసర్ భానురేఖ, హెల్త్ సెక్రటరీ సుజాత తదితరులు పాల్గొన్నారు.

జలాశయాలపైనే ఆశలు

- రెండు ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు
- కండలేరులో 50 టీఎంసీలు
- రబీకి ఢోకా లేనట్టే..



కండలేరు జలాశయం

పొదలకూరు: నాన్‌డెల్టా రైతుల ఆశలు చిగురిస్తున్నాయి. సోమశిల ప్రాజెక్ట్ నిండుకుండలా ఉండటమే కాక కండలేరు జలాశయంలో ఇప్పటికే 50 టీఎంసీల నీటి నిల్వలు ఉండడంతో రబీ సాగుకు ఢోకా లేదని భావిస్తున్నారు. ఐఏబీ సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 7.77 లక్షల ఎకరాలకు కండలేరు, సోమశిల జలాశయాల ద్వారా నీటిని అందించేందుకు ప్రతిపాదించారు.

సాగు ఎంతంటే..

సాధారణంగా వర్షాధారంగానే నాన్‌డెల్టా ప్రాంతంలో వరి పండించే వారు. ఈ ప్రాంతంలో చెరువులు నిండితేనే వరి పండేది. అయితే సాగునీటి కాలువలు తవ్వించిన తర్వాత ఆ పరిస్థితుల నుంచి కొంత గట్టెక్కినా నాన్‌డెల్టాకు సాగునీటి కేటాయింపులు అంతంతమాత్రంగానే ఉండేవి. ప్రస్తుతం రెండు ప్రాజెక్ట్‌ల్లో నీటి నిల్వలు ఉండడంతో రబీ సాగుకు ఇబ్బందులు తలెత్తవని రైతులు భావిస్తున్నారు. సోమశిల దక్షిణ కాలువ కింద సుమారు 6 వేల ఎకరాల్లో మండలంలోని రైతులు వరి పండిస్తుండగా, కండలేరు ఎడమగట్టు కాలువ అందించే సాగునీటి ద్వారా 8 వేల ఎకరాల్లో మెట్టప్రాంత రైతులు వరితోపాటు, అపరాల సాగు, పండ్ల తోటల సాగు చేస్తుంటారు.

నిల్వ పెరిగితే..

సోమశిల, కండలేరు జలాశయాల్లో నీటి నిల్వలు పెరిగితే ఈ ప్రాంత రైతుల వ్యవసాయం సాగుతుంది. రెండు ప్రాజెక్ట్‌ల ద్వారా సుమారు 14 వేల నుంచి 17 వేల ఎకరాల్లో వరి పండించే అవకాశం ఉంది. మండలంలోని చెన్నారెడ్డిపల్లి, నావూరు, భోగసముద్రం, బత్తులపల్లి తదితర గ్రామాల రైతులు సోమశిల దక్షిణ కాలువ కింద వరి పండించుకుంటారు. కండలేరు ఒకటో బ్రాంచ్ కాలువ కింద, ఎడమగట్టు కాలువ ద్వారా నీరు అందొచ్చు. రబీలో కనుపూరు కాలువ ద్వారా డెల్టా రైతులు పుష్కలంగా సాగునీటిని పారించుకుని పంటలు పండించుకునే పరిస్థితులున్నాయి. వర్షాలు తక్కువగా ఉన్నా పైతట్టు నుంచి వరద ప్రవాహం ప్రాజెక్ట్‌లకు ఉన్నందున సాగుకు అవకాశం కలిగింది.

కండలేరులో..

కండలేరు జలాశయంలో 50 టీఎంసీల నీటి నిల్వలున్నాయి. ఎడమగట్టు కాలువకు హై లెవల్ స్లూయిజ్ గుండా గ్రావిటీ ద్వారా నీరు విడుదల చేయాలంటే ఆ జలాశయంలో 35 టీఎంసీలుండాలి. నీటి నిల్వ తగ్గితే ఎత్తిపోతల పథకం ద్వారా ఎడమ కాలువకు విడుదల చేస్తారు. కాలువ ద్వారా చేజర్ల, పొదలకూరు, వెంకటాచలం మండలాల్లో 32 చెరువులను నింపేందుకు అవకాశం ఉంది. మెట్ట పంటలకు సైతం సాగునీటిని పెట్టుకునేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.



కండలేరు ఎడమగట్టు కాలువ (ఫైల్)

ఆశలు చిగురిస్తున్నాయ్



రబీ సీజన్‌కు రైతుల ఆశలు చిగురిస్తున్నాయి. నాన్ డెల్టా ప్రాంత రైతులు రబీలో పంటలు పండించుకునే అవకాశం ఏర్పడుతుంది. అధికారులు రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సాగునీటిని సరఫరా చేయాల్సి ఉంది. గ్రావిటీ ద్వారా సాగునీటిని అందజేస్తే ముందుగా నార్లు పోసుకునేందుకు వీలు కలుగుతుంది.

– జి.నారాయణరెడ్డి, రైతు, పులికల్లు

నార్లు పోసుకుంటున్నారు



మండలంలో రైతులు ముమ్మరంగా నార్లు పోసుకునే పనిలో ఉన్నారు. కేఎన్‌ఎం 1638 రకం వరి విత్తనాలను అధికంగా నార్లు పోసుకుంటున్నారు. ఈ రకం విత్తనాలను రాయితీపై కూడా అందజేస్తున్నాం. మండలంలో సుమారు 14 వేల ఎకరాల్లో నాట్లు పడొచ్చని భావిస్తున్నాం.

– ఎ.వాసు, ఏఓ, పొదలకూరు

తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని రామచంద్రాపురంలో పందుల పెంపకందారులకు నివేశన స్థలాలను ఇవ్వొద్దంటూ నిరసనను గ్రామస్తుల ఆధ్వర్యంలో సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాలనీలో నివేశన స్థలాల్లేక ఇబ్బంది పడుతున్నామని, ఈ తరుణంలో బుచ్చిరెడ్డిపాళెంలో ఖాళీ చేయించిన పందుల పెంపకందారులకు ఇక్కడ స్థలాన్ని ఇచ్చేందుకు అధికారులు యత్నించడాన్ని అంగీకరించబోమని స్పష్టం చేశారు. అనంతరం తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రాన్ని అందజేశారు. కాగా తాము స్థలాన్ని మాత్రమే పరిశీలించామని, ఇంకా ఎవరి పేర్లను సూచించలేదని.. ఆ స్థలాల్లో ఎవరికి పట్టాలుంటే వారికే చెందేలా చర్యలు చేపడతామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో నిరసనను విరమించారు.

ఇసుక లారీ సీజ్

పొదలకూరు: సంగం – పొదలకూరు రోడ్డులో వెళ్తున్న ఇసుక లారీని పోలీసులు ఆదివారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. నాకాబందీ చేపట్టి వాహనాలను తనిఖీ చేశారు. పెన్నానది నుంచి ఇసుకను లోడ్ చేసుకుని లారీ వస్తుండగా స్వాధీనం చేసుకుని మైనింగ్ అధికారులకు అప్పగించినట్టు ఎస్సై ఎస్‌కే హనీఫ్ వెల్లడించారు. రాత్రి వేళల్లో ఇసుకను తరలించకూడదనే నిబంధన మేరకు వాహనాన్ని సీజ్ చేసినట్టుగా తెలుస్తోంది.

311 మంది విద్యార్థుల గైర్హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో సోమవారం నిర్వహించిన డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షల్లో ఒక విద్యార్థి డిబార్ అైనట్లు వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. 5,042 మంది విద్యార్థులకు గానూ 4,731 మంది హాజరయ్యారని, 311 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు.

హెచ్‌ఐవీపై అవగాహన

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని రేబాలలో హెచ్‌ఐవీపై అవగాహన కార్యక్రమాన్ని చైల్డ్ ఫండ్ ఇండియా, లింక్ వర్కర్స్ స్కీమ్ సహకారంతో సోమవారం నిర్వహించారు. బాధితులకు పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులను సైతం ఉచితంగా అందజేస్తున్నామని వివరించారు.

బీచ్ రోడ్డు.. రొచ్చు రొచ్చు



అధ్వానంగా కృష్ణపట్నం బీచ్ రోడ్డు

ముత్తుకూరు: మండలంలోని కృష్ణపట్నం గ్రామం నుంచి సముద్రం వరకున్న రోడ్డు దారుణంగా ఉంది. ఆర్కాట్‌పాళెం నుంచి బీచ్ వరకు ఉన్న ఈ రోడ్డు వర్షాలకు రొచ్చు రొచ్చుగా మారుతోంది. ఈ మార్గంలో వందల ఎకరాల్లో రొయ్యల సాగు జరుగుతోంది. బీపీసీఎల్ కర్మాగారానికి కూడా ఈ రోడ్డు ద్వారానే వెళ్లాలి. కృష్ణపట్నం పోర్టుకు వెళ్లొచ్చు. అంతేకాకుండా బొగ్గు కన్వేయర్లు, లైట్ హౌస్ కూడా ఈ మార్గంలోనే ఉన్నాయి. అయితే, మట్టి రోడ్డు కావడంతో వాహనాల ప్రయాణాలకు ప్రతికూలంగా మారింది. నిలువెత్తు గోతులతో నిండిన ఈ రహదారి వర్షాల సమయంలో వాహనచోదకులకు ప్రమాదకరంగా మారుతోంది.

నమ్మండి.. ఇది హైస్కూల్ గ్రౌండే



గడ్డి, పిచ్చిమొక్కలతో గ్రౌండ్

తోటపల్లిగూడూరు: మండలంలోని చిన్నచెరుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్లే గ్రౌండ్‌కు ఎంతో ప్రత్యేకత ఉంది. క్రీడా పోటీల నిర్వహణకు సువిశాలమైన ఈ మైదానం అనుకూలంగా ఉండేది. మండలంలోనే ఎంతో ప్రాధాన్యత ఉన్న ఈ గ్రౌండ్ కొంతకాలం క్రితం వరకు విద్యార్థులు, స్థానిక యువత ఆటాపాటలతో సందడిగా ఉండేది. ప్రస్తుతం గడ్డి, పిచ్చిమొక్కలతో అడవిని తలపిస్తోంది. పాఠశాలలో విద్యార్థుల తగ్గిపోవడంతో పీఈటీ పోస్టు కోల్పోవాల్సి వచ్చింది. దీంతో విద్యార్థులు ఆటలకు దూరమై తరగతి గదులకే పరిమితమయ్యారు. గతంలో సెలవు దినాల్లో ఆటలాడే యువత ప్రస్తుతం గ్రౌండ్‌కు రాలేని పరిస్థితులు నెలకొన్నాయి. దీని నిర్వహణ గురించి ఎవరూ పట్టించుకోకపోవడంతో గడ్డి, పిచ్చిమొక్కలు పెరిగిపోయి అధ్వానంగా మారిపోయింది. ఇక్కడ విషసర్పాలు తిరుగుతున్నాయి. ప్లే గ్రౌండ్ ఇంతటి దుస్థితిలో ఉన్నా అటు అధికారులు.. ఇటు పాఠశాల ఉపాధ్యాయులు పట్టించుకోపోవడంపై స్థానిక క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మైదానాన్ని వినియోగంలోకి తీసుకువాలని కోరుతున్నారు.

ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలి



ప్రజాపోరు కార్యక్రమంలో నేతలు

బుచ్చిరెడ్డిపాళెం: ప్రజలపై మోపిన విద్యుత్ ట్రూ అప్ చార్జీల భారాన్ని రద్దు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి చల్లకొలుసు మల్లికార్జున డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన ప్రజాపోరు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ చార్జీలను తగ్గిస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చి, తాజాగా ట్రూ అప్ భారాన్ని ప్రజలపై కూటమి ప్రభుత్వం మోపుతోందని ఆరోపించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను విరమించుకోవాలని కోరారు. నిరుద్యోగం నానాటికీ పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఎం పట్టణ కార్యదర్శి పోతంశెట్టి శ్రీనివాసులు మాట్లాడారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఈ నెల 14న చేపట్టనున్న ధర్నాకు తరలిరావాలని కోరారు. ఆవాజ్ జిల్లా ఉపాధ్యక్షుడు జానీబాషా, మండల కార్యదర్శి మునీర్ అహ్మద్, వ్యవసాయ కార్మిక సంఘ నేతలు ఖాదర్‌బాషా, మొలతాటి శ్రీనివాసులు, డీవైఎఫ్ఐ నేత కోటయ్య, సీఐటీయూ నేతలు రాధయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు నివాళి



వీఎస్‌యూలో..

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్ద నున్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో సోమవారం భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు మాట్లాడుతూ అబుల్ కలాం విద్యారంగానికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, డాక్టర్ జె.విజిత, మేరీ సందీప, గోపాల్, హనుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- పొదలకూరు: పట్టణంలోని విజ్ఞాన్ జూనియర్ కాలేజీలో ట్రీస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని నిర్వహించారు. ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు ఆయన జీవిత చరిత్ర, విద్యా సంస్కరణలపై వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పలువురు విద్యావేత్తలు, రాజకీయ నాయకులు పాల్గొని ప్రసంగించారు.

టీబీ వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు చర్యలు

- జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి ఖాదర్‌వలీ



రికార్డులను పరిశీలిస్తున్న ఖాదర్‌వలీ

తోటపల్లిగూడూరు: గ్రామీణ ప్రాంతాల్లో టీబీ వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి ఖాదర్‌వలీ ఆదేశించారు. సోమవారం ఆయన కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి టీబీ వ్యాధిగ్రస్తులను గుర్తించాలన్నారు. అలాగే వ్యాధి నిరోధక టీకాలను సకాలంలో వేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి భానుప్రియ, సీసీ విజయ్‌కుమార్, సీహెచ్‌ఓ రమేష్, హెల్త్ ఎడ్యుకేటర్ ఉమర్, పర్యవేక్షకులు ఇందిరమ్మ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్రంగా ఇంటింటి సర్వే



సూచనలిస్తున్న జనార్దన్

కొడవలూరు: కేన్సర్‌పై ఈ నెల 14 నుంచి జరపనున్న ఇంటింటి సర్వేను సమగ్రంగా నిర్వహించాలని యల్లాయపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారి జనార్దన్ పేర్కొన్నారు. పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజూ ఐదిళ్లలో సర్వేను జరపాల్సి ఉంటుందన్నారు. కేన్సర్ అనుమానిత లక్షణాలుంటే జిల్లా ఆస్పత్రికి సిఫార్సు చేయాలని సూచించారు. ఇతర వ్యాధులపై సైతం దృష్టి సారించాలని తెలిపారు. హెచ్‌ఎస్‌లు రజియా, సురేంద్ర, ఎమ్మెల్‌హెచ్‌పీలు రోజ్ మేరీ, జాస్మిన్, ఏఎన్‌ఎంలు మహేశ్వరి, సుష్మ, సుమతి, హెచ్‌ఏ సురేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడిన విజయలక్ష్మి

మనుబోలు: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడిన ఘటన మనుబోలు బైపాస్‌రోడ్డుపై సోమవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మనుబోలు దళితవాడకు చెందిన దూడల విజయలక్ష్మి తన సోదరి నెల్లూరు నుంచి బస్సులో వస్తోందని సమాచారం అందడంతో ఆమెను తీసుకొచ్చేందుకు హైవే దాటుతోంది. ఈ క్రమంలో మడమనూరు గ్రామానికి చెందిన ఉప్పు యశ్వంత్ మోటార్‌బైక్‌పై వెళ్తూ విజయలక్ష్మిని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో గాయపడిన విజయలక్ష్మి, యశ్వంత్‌ను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్తీకం.. తేజోమయం



పొదలకూరు: శివాలయంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు

పొదలకూరు: పట్టణంలోని శ్రీకామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి (శివాలయం) దేవస్థానంలో సోమవారం కార్తీక మాస పూజలను నిర్వహించారు. ప్రధాన అర్చకుడు ప్రసాద్‌స్వామి ఆకాశ దీపాన్ని వెలిగించారు. పట్టణం నుంచే కాక చుట్టుపక్కల గ్రామాల నుంచి మహిళా భక్తులు మహిళలు విచ్చేసి దేవస్థానం ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించారు. పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్ శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక దీప మహోత్సవాలను నిర్వహించారు. మండలంలోని శ్రీమల్లికార్జున సమేత కామాక్షితాయి దేవస్థానంలో కార్తీక పూజలను నిర్వహించారు. మహిళా భక్తులు ఆలయ ప్రాంగణంలో ప్రమిదలు వెలిగించారు. గ్రామపెద్ద వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. చెన్నారెడ్డిపల్లి పంచలింగేశ్వరస్వామి దేవస్థానంలో నావూరు, చెన్నారెడ్డిపల్లి, నావూరుపల్లి గ్రామస్తులు పూజలు చేశారు.

- మనుబోలు: కార్తీక మాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకుని మండలంలోని శివాలయాల్లో పూజా కార్యక్రమాలు జరిగాయి. మనుబోలు శివాలయం, సంగమేశ్వరాలయాలతోపాటు పిడూరు, పిడూరుపాళెం, బద్దెవోలు, కొలనకుదురు, మడమనూరు, కుడితిపల్లి తదితర గ్రామాల్లోని శివాలయాలకు భక్తులుతో పోటెత్తారు.
- బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో దీపాలను భక్తులు వెలిగించారు. స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు జరిపారు.
- ఇందుకూరుపేట: మైపాడు, ఇందుకూరుపేట, కొత్తూరు, ముదివర్తిపాళెం తదితర గ్రామాల్లోని శివాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మైపాడు తీరంలో పుణ్యస్నానాలను ఆచరించారు. అనంతరం తీరంలో ఉన్న శివాలయాల్లో పూజలు చేశారు.



మనుబోలు: సంగమేశ్వరాలయంలో పూజలు



పొదలకూరు: చెన్నారెడ్డిపల్లి పంచలింగేశ్వరస్వామి సన్నిధిలో..



బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలో..